క్లుప్తంగా

నేడు విద్యుత్ అంతరాయం

చిత్తూరు కార్పొరేషన్: విద్యుత్‌లైన్ల మరమ్మతుల నిమిత్తం ఆదివారం పలు ప్రాంతాల్లో కరెంటు ఉండదని ట్రాన్స్‌కో ఈఈ మునిచంద్ర తెలిపారు. గిరింపేట, గొడుగుమూరు, బాలాజీనగర్ కాలనీ, దుర్గానగర్ కాలనీ, కట్టమంచి, కొంగారెడ్డిపల్లె, లాయర్స్‌కాలనీ, ఆర్టీసీబస్టాండ్, కలెక్టర్‌బంగ్లా, బీవీరెడ్డి కాలనీ ప్రాంతాల్లో ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు సరఫరా ఉండదన్నారు. ప్రజలు సహకరించాలని కోరారు.

పంటలను కాపాడుకోవాలి


మాట్లాడుతున్న ఏవో వరలక్ష్మి

ఐరాల: బంగాళాఖాతంలో ఏర్పడిన వాయుగుండం ప్రభావంతో ఐదు రోజులుగా మండల వ్యాప్తంగా కురుస్తున్న వర్షాలకు పంటలు దెబ్బతినకుండా రైతులు పంటలను కాపాడుకోవాలని ఏఓ వరలక్ష్మి కోరారు. శనివారం ఐరాల, ఎర్రేపల్లెలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. వర్షాల కురుస్తున్న నేపథ్యంలో ధాన్యం రంగు మారకుండా ఉప్పునీటిని పంటపై పిచికారీ చేయాలన్నారు. రైతులు అధునాతన పద్ధతులపై ఎప్పటికప్పుడు అవగాహన కలిగి ఉంటూ రసాయన ఎరువుల వాడకం తగ్గించి సేంద్రియ ఎరువులు వాడుకోవాలన్నారు. అధిక దిగుబడులు సాధించడానికి భూమి సారవంతంగా, ఆరోగ్యవంతంగా ఉండేలా చూసుకోవాలన్నారు. కార్యక్రమంలో వీఏఏలు పాల్గొన్నారు.

సర్వసభ్య సమావేశం రేపు

పూతలపట్టు: మండలంలోని స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో సోమవారం ఉదయం 10.30 నిమిషాలకు సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ నాగరాజు శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ నెల 16వ తేదీ నిర్వహించాల్సిన సర్వసభ్య సమావేశం కొన్ని అనివార్య కారణాల వాయిదా పడింది. ఈ సమావేశం ఈ నెల 21వ తేదీన నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ సమావేశానికి ముఖ్యతిథిగా ఎమ్మెల్యే మురళీమోహన్ హాజరవుతున్నట్లు చెప్పారు. ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, మండల అధికారులు తప్పక హాజరు కావాలని కోరారు.

ఆర్టీసీ బస్సు ఢీకొని గాయాలు

తవణంపల్లె: కాణిపాకం రోడ్డులో ఉన్న వల్లభ డెయిరీ సమీపంలో ముందు వెళ్తుతున్న ఆర్టీసీ బస్సును బైక్‌పై వెళ్తున్న వ్యక్తి ఢీకొనడంతో వ్యక్తికి గాయాలయ్యాయి. చిత్తూరు నగరం కట్టమంచికి చెందిన రాహుల్(28) అనే వ్యక్తి బైక్‌పై కాణిపాకం వెళ్తూ ఆర్టీసీ బస్సును వెనుక వైపు నుంచి ఢీకొట్టి కింద పడ్డాడు. ప్రమాదంలో గాయాలు తగలడంతో స్థానికులు చికిత్స కోసం చిత్తూరుకు తరలించారు. దీనిపై పోలీసులను విచారించగా ఎలాంటి ఫిర్యాదు అందలేదని తెలిపారు.

కానరాని సమయపాలన


సచివాలయం గేట్ ముందు ప్రజలతో చర్చిస్తున్న జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు

వి.కోట: సచివాలయ సిబ్బంది సమయపాలన పాటించడం లేదని జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు తెలిపారు. ఆయన శనివారం మండలంలోని ఓగు సచివాలయాన్ని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేయడానికి వెళ్లారు. ఉదయం 11.30 గంటలకు సచివాలయం తాళం వేసి వుండడంతో అవాక్కయ్యారు. బయట వేచి ఉన్న ప్రజలతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. సిబ్బందికి ఇంత నిర్లక్ష్యమా అంటూ స్థానిక ఎంపీడీఓకు ఫోన్ ద్వారా సమాచారం అందించి సచివాలయ ఉద్యోగులు ఎక్కడకెళ్లారు అని ఆరా తీశారు. అనంతరం అందుబాటులోలేని ఉద్యోగులకు నోటీసులు పంపాలని జెడ్పీ చైర్మన్ ఆదేశించారు.

తాగి వాహనం నడిపిన వారికి జరిమానా

చిత్తూరు అర్బన్: మద్యం తాగి వాహనాలు నడిపిన ఒక్కో వ్యక్తికి రూ.పది వేల చొప్పున జరిమానా విధిస్తూ చిత్తూరులోని ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి ఉమాదేవి శనివారం తీర్పునిచ్చారు. పలమనేరులో సీఐ కె.శ్రీనివాసులు శుక్రవారం వాహనాలు తనిఖీ చేస్తుండగా పలువురు మద్యం సేవించి వాహనాలు నడుపుతున్నట్లు గుర్తించారు. నలుగురిపై కేసు నమోదుచేసి, కోర్టుకు తరలించారు. ఒక్కొక్కరికి రూ.10 వేలు చొప్పున మొత్తం రూ.40 వేల జరిమానా విధిస్తూ న్యాయమూర్తి తీర్పునిచ్చారు.

మరికొందరికి..

చిత్తూరు నగరంలో మద్యం సేవించి వాహనాలు నడిపిన 14 మందికి న్యాయమూర్తి ఉమాదేవి జరిమానా విధించారు. చిత్తూరు ట్రాఫిక్ సీఐ నిత్యబాబు శుక్రవారం వాహనాలు తనిఖీ చేయగా, 14 మంది మద్యం తాగి వాహనాలు నడపడంతో వారిపై కేసు నమోదు చేసి కోర్టుకు తరలించారు. నిందితులపై నేరం రుజువు కావడంతో 13 మందికి రూ.10 వేలు చొప్పున రూ.1.30 లక్షలు, మరో వ్యక్తి మద్యం సేవించి వాహనం నడుపుతూ రెండోమారు పట్టుబడటంతో ఇతనికి రూ.15 వేల జరిమానా విధించారు.

చతికిలబడి..!

ప్రభుత్వ స్కూళ్లు చతికిలబడుతున్నాయి. కూటమి ప్రభుత్వం స్కూళ్ల నిర్వహణను గాలికొదిలేసింది. రుచీపచిలేని భోజనం పెట్టి పిల్లల కడుపు కొడుతున్నారు. ఇంటి నుంచే క్యారియర్లు తెచ్చుకుని మధ్యాహ్నం తింటున్నారు. స్కూళ్లలో కనీస వసతులు మృగ్యమయ్యాయి. భవన నిర్మాణాలు మధ్యలోనే నిలిచిపోయాయి. ఇక మరుగుదొడ్ల పరిస్థితి అధ్వానంగా ఉంది. టాయిలెట్స్ క్లీనింగ్ రసాయనాలు నేటికీ పంపిణీ చేయలేదు. పలువురు ఉపాధ్యాయులు బడిని పక్కన పెట్టి సొంత పనుల బాట పడుతున్నారు. దీంతో విద్యార్థులకు ప్రభుత్వ స్కూల్లో నాణ్యమైన విద్య, వసతులు లేవని తల్లిదండ్రులు వాపోతున్నారు.

- ప్రభుత్వ స్కూళ్లలో గాడితప్పిన చదువులు
- రుచీపచి లేని భోజనం
- ఇంటి దగ్గర నుంచే క్యారియర్లు తెచ్చుకుంటున్న విద్యార్థులు
- కనీసం తాగునీరు కూడా కరువే
- కంపు కొడుతున్న మరుగుదొడ్లు
- సొంత పనుల్లో ఉపాధ్యాయులు నిమగ్నం
- పట్టించుకోని విద్యాశాఖ అధికారులు

కాణిపాకం: గతంలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ప్రభుత్వ పాఠశాలలను కార్పొరేట్‌కు ధీటుగా తీర్చిదిద్దింది. విద్యార్థులకు పౌష్టికాహారం అందించడంతో పాటు ఇంగ్లిష్ మీడియం, నాణ్యమైన అందించింది. కానీ ప్రస్తుత ప్రభుత్వం స్కూళ్ల కనీస నిర్వహణను సైతం గాలికొదిలేసింది. నాడు–నేడు పనులను పక్కన పెట్టింది. దీంతో పాఠశాలల్లో అభివృద్ధి పనులు నిలిచిపోయాయి. మధ్యాహ్న భోజనం నాణ్యత నాసిరకంగా ఉందని విద్యార్థులు, వారి తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. చిత్తూరు, పూతలపట్టు నియోజకవర్గాల్లో 502 ప్రాథమిక, 78 ప్రాథమికోన్నత, జెడ్పీ 122 పాఠశాలలు ఉన్నాయి. ఇందులో మొత్తం 53,500 మంది విద్యార్థులు విద్యను అభ్యసిస్తున్నారు.

తినలేం..

ప్రభుత్వ స్కూళ్లలో చదివే పిల్లలకు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం జగనన్న గోరుముద్ద ద్వారా నాణ్యమైన రుచికరమైన భోజనం అందించింది. మెనూను పక్కాగా అమలు చేస్తూ..రుచికమైన భోజనంలో లోటు లేకుండా చూసింది. అయితే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజన పథకంలో మెనూ ప్రకారం కాకుండా నాణ్యత లేని భోజనం పెడుతున్నారు. కూరగాయలు, నిత్యావసర సరుకుల ధరలు పెరగడంతో మధ్యాహ్న భోజన నిర్వహణ నిర్వాహకులకు కూడా కష్టతరంగా మారింది. దీంతో ఏదో రకమైన వంట వండి పిల్లలకు వడ్డిస్తున్నారు. ఇందులో రుచి పచిలేకపోవడంతో విద్యార్థులు బడిలో భోజనం తినేందుకు ఇష్టపడడం లేదు. ఇళ్ల నుంచి క్యారియర్లు తెచ్చుకుంటున్నారు. గత ప్రభుత్వం హయాంలో రోజుకు 48 వేల నుంచి 50 వేల వరకు విద్యార్థులు మధ్యాహ్న భోజనం తినేవారు. ప్రస్తుతం నాణ్యత లేకపోవడంతో స్కూళ్లలో తినేవారి సంఖ్య భారీగా తగ్గిపోయింది. ప్రస్తుతం 30 వేల నుంచి 40 వేల మంది మాత్రమే తింటున్నారని తెలుస్తోంది. దీంతో పాటు పలు పాఠశాలలో తాగునీరు మింగుడు పడడం లేదు.


శేషాచలపురం పాఠశాల ఆవరణలో అపరిశుభ్రంగా ఉన్న పరిసరాలు



పెచ్చులూడిన శేషాచలపురం ప్రాథమిక పాఠశాల

తద్వారా ఇళ్ల నుంచి వాటర్ క్యాన్ల ద్వారా తాగునీరు తెచ్చుకుంటున్నారు.

వంటా తంటా..

రెండు నియోజకవర్గాల్లో 702 వంట ఏజెన్సీలు ఉన్నాయి. వంట కార్మికులు, సహాయకులను కలుపుకుని 1300 మంది పనులు చేస్తున్నారు. పారిశుద్ధ్య కార్మికులు మరో 695 మంది ఉన్నారు. వాచ్‌మెన్లు 70 మంది ఉన్నారు. వీరిలో గత ఐదేళ్లగా పని చేసే వారు ఉండగా, సుదీర్ఘకాలంగా 20 ఏళ్లకు పైబడి పని చేస్తున్న వారు కూడా ఉన్నారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత జిల్లాలో మధ్యాహ్న భోజన పథకంలో పనిచేస్తున్న కార్మికులకులకు కష్టాలు మొదలయ్యాయి. అరకొర వేతనాలతో బతుకు బండిని లాగుతున్న కార్మికులను తీసి వేసేందుకు ఒత్తిళ్లకు గురి చేస్తున్నారు. ఇప్పటి వరకు 36 మందిని తొలగించారని.. మరికొందరిని తొలగించేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయని పలువురు ఆరోపిస్తున్నారు.

కంపు.. కంపు..

ప్రభుత్వ స్కూళ్లలో టాయిలెట్లను శుభ్రం చేసేందుకు ఇవ్వాల్సిన కెమికల్స్ కూడా కూటమి ప్రభుత్వం ఇంతవరకు ఇవ్వలేదు. దీంతో దగ్గరలో ఉన్న బోరు వాటర్లతోనే స్వీపర్లు శుభ్రం చేస్తున్నారు. దాని వల్ల మరుగుదొడ్ల నుంచి దుర్వాసనలు క్లాస్ రూములలోకి వస్తున్నట్లు విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. నాడు–నేడు కింద ఎంపికైన పాఠశాలల్లో నిర్మాణంలో ఉన్న పనులు మధ్యలోనే నిలిచిపోవడంతో ప్రభుత్వం అందించిన సిమెంట్, ఇతర వస్తువులు నిరుపయోగంగా ఉన్నాయి. దీంతో విద్యార్థులు మల, మూత్ర విసర్జనకు ఆరు బయటకు పరుగులు పెడుతున్నారు.

విధులకు డుమ్మా..

కొందరు ఉపాధ్యాయులు విధులకు డుమ్మా కొడుతున్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో విధిగా హాజరు పెట్టాల్సి వచ్చేది. సమయానికి హాజరు పెట్టడంతో పాటు పాఠశాల బాధ్యతను ఉపాధ్యాయుల చేతిలో పెట్టింది. ప్రభుత్వ మార్పుతో పలువురు టీచర్లు ఆ బాధ్యతను మరిచారు. అటెండెన్స్ ఇష్టానుసారంగా వేస్తున్నారు. మరికొందరు ప్రైవేటు వ్యక్తులకు బాధ్యతలను అప్పజెప్పి ఇతర కార్యకలాపాలను చూసుకుంటున్నారు. అధికారులు ప్రశ్నిస్తే అనారోగ్య సమస్యలు చెబుతూ తప్పించుకుంటున్నారు.

పీవీకేఎన్ మైదానంలో టపాసుల విక్రయాలు


మాట్లాడుతున్న ఆర్డీఓ శ్రీనివాసులు

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లా కేంద్రంలోని పీవీకేఎన్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానంలో దీపావళి పండుగకు టపాసులు విక్రయించాలని నిర్ణయించినట్లు ఆర్డీఓ శ్రీనివాసులు తెలిపారు. ఆయన శనివారం ఆర్డీఓ కార్యాలయంలో సమన్వయ కమిటీ సమావేశం నిర్వహించారు. ఆర్డీఓ మాట్లాడుతూ టపాసులు విక్రయించే వారు ప్రభుత్వ నియమ, నిబంధనలు పాటించాలన్నారు. ముందస్తు అనుమతులు తప్పనిసరి అని స్పష్టం చేశారు. అనుమతులు లేకుండా టపాసులు విక్రయిస్తే కఠిన చర్యలుంటాయని హెచ్చరించారు. ఈ ఏడాది పీవీకేఎన్ ప్రభుత్వ కళాశాల మైదానంలో ఎవరికీ ఇబ్బందులు తలెత్తకుండా దుకాణాలను ఏర్పాటు చేసేందుకు నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో జిల్లా అగ్నిమాపక శాఖ అధికారి పెద్దిరెడ్డి, పలు మండలాల తహసీల్దార్లు పాల్గొన్నారు.

పంటలపై ఏనుగుల దాడులు

కల్లూరు(పులిచెర్ల): మండలంలో పంటలపై ఏనుగుల దాడులు ఆగడంలేదు. ప్రతి రోజు ఎక్కడో ఒకచోట పంటలను నాశనం చేస్తూనే ఉన్నాయి. తాజాగా శనివారం తెల్లవారుజామున మండలంలోని ఆవుల పెద్దిరెడ్డిగారి పల్లె, చిట్టారెడ్డి పేటల్లో ఏనుగుల గుంపు పంట పొలాలపై దాడి చేసి ధ్వంసం చేసింది. ముఖ్యంగా వరి పైరును ఏనుగులు తొక్కి నాశనం చేశాయి. చేతి కొచ్చిన పంటను తీవ్రంగా నష్ట పోయిన రైతులు దిగులుచెందుతున్నారు. అటవీశాఖ అధికారులు నష్ట పోయిన పంటలను పరిశీలించి ఉన్నత అధికారులకు తెలియ జేస్తామన్నారు.

ఈచనేరిలో వైద్యసేవలు


ఈచనేరిలో వైద్యసేవలు పొందుతున్న రోగులు

తవణంపల్లె: వర్షాకాలంలో జ్వరాలు సోకకుండా ముందస్తు జాగ్రత్తలు నీటిని కాచి చల్లార్చి తాగాలని వైద్యాధికారి డాక్టర్ వినయ్‌కుమార్ తెలిపారు. శనివారం మండలంలోని ఈచనేరిలో నిర్వహించిన ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమానికి అనూహ్య స్పందన లభించింది. డాక్టర్ వినయ్‌కుమార్ 40 మంది రోగులకు వైద్య సేవలందించారు. గర్భిణులు, బాలింతలు, మహిళలు, బీపీ, షుగర్ వ్యాధిగ్రస్తులకు వైద్యసేవలు అందించారు. అవసరమైన వారికి ఉచితంగా మందులు అందజేశారు. గ్రామీణ ప్రాంతాల్లో అంటువ్యాధులు ప్రబలకుండా తగు జాగ్రత్తలు పాటించాలని, తాగునీరు కలుషితం కాకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రభుత్వాస్పత్రిలో గర్భిణులు ప్రసవం అయితే తల్లీబిడ్డకు శ్రేయస్కరం అన్నారు. 108, 104, తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్‌ను సద్వినియోగం చేసుకోవాలని వివరించారు. గర్భిణులు రక్తహీనత రాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది, ఏఎన్ఎం, ఎంఎల్‌హెచ్‌పీ, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

సాక్షి విలేకరిపై వైద్యాధికారి చిందులు

యాదమరి(పూతలపట్టు): ప్రజా సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లి ప్రజల పక్షాన నిలబడే విలేకరిపై ఓ అధికారి బెదిరింపులకు దిగాడు. వివరాలు ఇలా.. యాదమరి మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో రోగులకు అందే వైద్య సేవల గురించి తెలుసుకోవడానికి స్థానిక సాక్షి విలేకరి శుక్రవారం వెళ్లాడు. అయితే మెడికల్ ఆఫీసర్ గదిలో వైద్యాధికారి లేడు. అక్కడే ఎంఎల్‌హెచ్‌పీ రోగులకు వైద్యం అందిస్తున్నారు. అయితే శనివారం ఆ వైద్యాధికారి విలేకరికి ఫోన్ చేసి ''మీకు ఆస్పత్రిలోకి ఎవరు అనుమతి ఇచ్చారు? ఎలా వస్తారు'' అంటూ నోటికి వచ్చినట్లు మాట్లాడారు. తాను సెలవులో ఉన్నట్లు వైద్యాధికారి చెప్పుకొచ్చాడు. అయితే జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారిని ఆరా తీయగా రెండు గంటలు అనుమతి తీసుకున్నట్లు తెలిపారు. శుక్రవారం వైద్యాధికారి సెలవు పెట్టలేదు.

గొర్రెలలో నట్టల నివారణ తప్పనిసరి


గొర్రెలకు నట్టల నివారణ మందు తాపిస్తున్న ఏడీ పద్మావతి

ఐరాల: వర్షాలకు గొర్రెలు, మేకలకు వివిధ రకాల వ్యాధులు రాకుండా ముందు జాగ్రత్తగా నట్టల నివారణ మందు తప్పనిసరిగా తాపించాలని పశు సంవర్ధక శాఖ ఏడీ పద్మావతి సూచించారు. ఆమె శనివారం పెద్దగొల్లపల్లె, 35 యర్లంపల్లె గ్రామాల్లో ఉచితంగా నట్టల నివారణ మందును జీవాలకు తాపించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గొర్రెలు, మేకల్లో బాహ్య పరాన్నజీవులు, అంతర పరాన్నజీవులైన ఏలికపాములు, బద్దె పురుగులు, ఖార్జపు జలగలు, పొట్ట జలగలు ఏర్పడడం వల్ల జీవాలు బలహీనపడి మరణిస్తాయన్నారు. సకాలంలో మందులు తాగించకుంటే జీవాలు మరణించే అవకాశం ఉంటుందన్నారు. అంతేగాకుండా జీవాల ఉత్పత్తి, ఉత్పాదక శక్తి, పునరుత్పత్తి సమస్యలు, రోగ నిరోధక శక్తి తగ్గి జీవాలు వ్యాధుల బారిన పడి మరణాలు సంభవిస్తాయని తెలిపారు. మండలంలో 10,400 గొర్రెలు, 4,418 మేకలకు నట్టల నివారణ మందు తాగించడం ద్వారా 140 మంది గొర్రెలు, మేకల పెంపకందారులకు లబ్ధి చేకూరుతుందని వివరించారు. కార్యక్రమంలో పశువైద్య సిబ్బంది పాల్గొన్నారు.

వైద్య విద్య ప్రమాణాలను పెంపొందించాలి

గుడుపల్లె: కాలానుగుణంగా మారుతున్న పరిణామాలను దృష్టిలో ఉంచుకుని వైద్య విద్య విధానాల ప్రమాణాలను పెంపొందించాలని పీఈఎస్ మెడికల్ కళాశాల ప్రిన్సిపల్ హెచ్ఆర్ క్రిష్ణారావు పేర్కొన్నారు. శనివారం పీఈఎస్ కళాశాలలో సతత వైద్య విద్యా విధానం గురించి నిర్వహించిన సదస్సును ఆంధ్ర, కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాలకు సంబంధించిన వైద్యులతో అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. పీజీ వైద్య విద్యార్థుల కోసం జంతువుల కాట్లు, విష ప్రయోగం, మానవులు జంతువుల పర్యావరణ పరస్పర సంబంధం అనే కార్యక్రమంపై ప్రత్యేక శిక్షణ ఇచ్చారు. ఈ విధానాలతో 2030 నాటికి రేబిస్‌ను నిర్మూలించడం అనే గ్లోబల్ లక్ష్యానికి మద్దతు తెలిపారు.

ప్రభుత్వాస్పత్రుల్లో చర్యలకు రంగం సిద్ధం

- ఆయా, పీహెచ్‌సీ డాక్టర్లకు నోటీసులు జారీ

సాక్షి ఎఫెక్ట్..

పలమనేరు: పలమనేరు నియోజకవర్గంలోని ప్రభుత్వాస్పత్రుల్లో నెలకొన్న సమస్యలపై జిల్లా వైద్యఆరోగ్యశాఖ అధికారిని డా.ప్రభావతిదేవి అవసరమైన చర్యలను చేపట్టారు. ఆమేరకు స్థానిక సాక్షి దినపత్రికలో శుక్రవారం ప్రచురితమైన 'వైద్యం అంతంత మాత్రమే' శీర్షికపై ఆమె తీవ్రంగా స్పందించి సంబంధిత మండలాల ఆరోగ్య వైద్యాధికారులకు నోటీసులు జారీ చేశారు. దీంతో పలమనేరు మండలంలోని కొలమాసనపల్లి పీహెచ్‌సీలో పిచ్చిమొక్కలను అధికారులు తొలగించారు. అక్కడి మరుగుదొడ్లను అందుబాటులో ఉంచేలా చర్యలు తీసుకుంటామని డా.సుధారాణి తెలిపినట్టు పేర్కొన్నారు. వి.కోట మండలంలోని ఓగు ఆస్పత్రి వద్ద మురుగునీటి గుంతను తోడి చర్యలు తీసుకోవాలని డీఎంహెచ్ఓ ఆదేశించారు. అలాగే వైద్య సిబ్బంది తక్కువగా ఉన్నచోట తగిన చర్యలను తీసుకుంటామని తెలిపారు. రాయలపేట ఆస్పత్రి ప్రాంగణంలో పారిశుధ్యపనులు చేపట్టనున్నట్టు అందులో తెలిపారు. ఇదే రీతిలో సంబంధిత మండలాల వైద్యులు తగిన చర్యలను తీసుకోనున్నట్టు పేర్కొన్నారు. ఏదేమైనా ప్రభుత్వ ఆస్పత్రుల్లో సమస్యలపై జిల్లా ఉన్నతాధికారులు స్పందించిన తీరుపై సామాన్య ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.


ఓగులో పీహెచ్‌సీల్లో శుభ్రం చేసిన దృశ్యం

అన్నదాన భవనం పరిశీలన

కాణిపాకం: కాణిపాకం శ్రీవరసిద్ధి వినాయకస్వామి దేవస్థానంలో నూతనంగా నిర్మిస్తున్న అన్నదానం భవన నిర్మాణ పనులను శనివారం ఈఓ గురుప్రసాద్ పరిశీలించారు. పనుల్లో జాప్యం లేకుండా చూడాలని, నాణ్యత జరగాలన్నారు. అనంతరం నిధుల మంజూరు, చెల్లింపులు, పెండింగ్ బిల్లులపై ఆరా తీశారు. కార్యక్రమంలో ఈఈ వెంకటనారాయణ, ఏఈఓ రవీంద్రబాబు, ఏఈ శివాంజనేయులు తదితరులు ఉన్నారు.

ప్రతి రోగికి వైద్యసేవలు


గుడిపాల: వైద్యసేవలు అందిస్తున్న డాక్టర్ సంధ్య

గుడిపాల: ప్రతి ఇంటి ముంగిటకు వెళ్లి, ప్రతి రోగికి వైద్యసేవలు అందజేయడం జరుగుతుందని వైద్యాధికారి సంధ్య అన్నారు. శనివారం పెద్దిశెట్టిపల్లెలో 104 వాహన సేవలు అందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామాల్లోనే ప్రతి ఇంటి ముంగిటకు వైద్యసేవలను అందజేస్తున్నట్లు చెప్పారు. అనంతరం 67 మంది రోగులకు బీపీ, షుగర్, గర్భిణులకు పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులను అందజేశారు. గ్రామంలో మంచం పట్టిన రోగులకు ఇంటి వద్దకే వెళ్లి వైద్యసేవలు చేశారు. వర్షాలు పడుతున్న నేపథ్యంలో ప్రతి ఒక్కరూ ఆరోగ్యంపై జాగ్రత్త వహించాలన్నారు. కార్యక్రమంలో వైద్యసిబ్బంది తేజ, ఇందుమతి, చంద్రశేఖర్, నిరోష, నరసమ్మ పాల్గొన్నారు.

ఆరుతడి పంటల సాగుపై అవగాహన


అవగాహన కల్పిస్తున్న అధికారులు

తవణంపల్లె: రైతులు ఆరుతడి పంటల సాగుపై దృష్టి సారించాలని ఏఓ ప్రవీణ్ సూచించారు. శనివారం పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా ఎగువ తవణంపల్లె, మిట్టపల్లె గ్రామాల్లో ఆరుతడి పంటల సాగుపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. మిట్టపల్లెలో క్షేత్రస్థాయిలో మామిడి తోటను పరిశీలించారు. తేమ ఉన్నప్పుడే రైతులు మామిడి తోటల్లో గడ్డిని దున్ని వేయాలన్నారు. లోతుగా దుక్కి దున్నితే భూమిలో తేమ బాగా ఉంటుందన్నారు. యాజమాన్య పద్ధతులు పాటిస్తే మామిడిలో అధిక దిగుబడి సాధించవచ్చన్నారు. అదేవిధంగా ఆధునిక వ్యవసాయ పద్ధతులు పాటించాలన్నారు. ఆరుతడి పంటలు సాగు చేస్తే తక్కువ ఖర్చుతో ఎక్కువ ఆదాయం వస్తుందని వివరించారు. ఈ వర్షాలకు ఉలవలు సాగు చేయడానికి మంచి సమయం అన్నారు. ఉలవలకు మార్కెట్‌లో కూడా మంచి డిమాండ్ ఉందన్నారు. రసాయన ఎరువుల వినియోగం తగ్గించి సేంద్రియ ఎరువులు అధికంగా వాడాలన్నారు. రైతులకు రైతు సేవా కేంద్రాల్లో అవసరమైన ఎరువులు అందుబాటులో ఉంటాయన్నారు. కార్యక్రమంలో రైతు సేవా కేంద్రం సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి పోటీలకు ఐరాల విద్యార్థులు


రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులతో హెచ్ఎం, పీడీ

ఐరాల: స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులు రాష్ట్ర స్థాయి అండర్–17 ఫెన్సింగ్ పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల హెచ్ఎం కోమల తెలిపారు. ఆమె శనివారం మాట్లాడుతూ ఈ నెల 16న యాదమరి జెడ్పీ హైస్కూల్ క్రీడా మైదానంలో నిర్వహించిన జిల్లా స్థాయి అండర్–17 ఫెన్సింగ్ పోటీల్లో తమ పాఠశాలకు చెందిన మహేష్, రెడ్డి ప్రసాద్, జీవన్‌సాయి, రోహిత్, రంజిత్ విశేష ప్రతిభ కనబరచి రాష్ట్ర స్థాయి ఫెన్సింగ్ పోటీలకు ఎంపికయ్యారని చెప్పారు. వీరందరూ ఈ నెల 20 నుంచి 22వ తేదీ వరకు నంద్యాలలోని డిస్ట్రిక్ స్పోర్ట్స్ అథారిటీ ఆధ్వర్యంలో నిర్వహించనున్న రాష్ట్ర స్థాయి అండర్–17 ఫెన్సింగ్ పోటీల్లో జిల్లా తరపున ప్రాతినిధ్యం వహించనట్లు ఆమె పేర్కొన్నారు. క్రీడాకారులను, పీడీ దేవాను, ఖేలో ఇండియా ఫెన్సింగ్ కోచ్ రాఘవ కార్తీక్‌ను పాఠశాల ఎస్ఎంసీ చైర్మన్ మహబూబ్‌బాషా, ఉపాధ్యాయులు, ఐల గురివిరెడ్డి మెమోరియల్ ట్రస్ట్ వ్యవస్థాపకులు అభినందించారు.

ఎక్స్‌ప్రెస్ హైవే పనులకు ఆటంకం కలిగించొద్దు


బంగారుపాళెం: బలిజపల్లెలో ఎక్స్‌ప్రెస్ హైవే రోడ్డు పనులను పరిశీలిస్తున్న జేసీ విద్యాధరి

బంగారుపాళెం: మండలంలో జరుగుతున్న ఎక్స్‌ప్రెస్ హైవే రోడ్డు పనులకు ఆటంకం కలిగించవద్దని జిల్లా జాయింట్ కలెక్టర్ విద్యాధరి అన్నారు. శనివారం మండలంలోని బలిజపల్లె వద్ద ఎక్స్‌ప్రెస్ హైవే రింగ్ రోడ్డు పనులను హైవే సిబ్బంది చేపట్టారు. రింగ్‌రోడ్డు నిర్మాణ స్థలంలో ఉన్న కళాగ్రాండ్ హోటల్ వద్ద హైవే సిబ్బంది పనులు చేపట్టారు. అయితే యజమాని అభ్యంతరం వ్యక్తం చేసి పనులు చేయరాదంటూ అడ్డుకునే ప్రయత్నం చేశారు. హైవే అధికారులు సమస్యను జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు జేసీ బలిజపల్లెలో జరుగుతున్న హైవే పనులను పరిశీలించారు. రింగ్ రోడ్డు పనులు జరిగే స్థలంలో గల హోటల్‌ను జేసీ పరిశీలించారు. అనంతరం ఆమె మీడియాతో మాట్లాడుతూ చెన్నై నుంచి బెంగళూరు వరకు ఎక్స్‌ప్రెస్ హైవే రోడ్డు పనులను చేపట్టిందన్నారు. ఇందులో భాగంగా భూములు ఇచ్చిన వారికి ప్రభుత్వం పరిహారం అందించిందన్నారు. అందులో భాగంగా బలిజపల్లె వద్ద రింగు రోడ్డు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. ఆ స్థలంలో కళాగ్రాండ్ హోటల్ ఉందన్నారు. సదరు హోటల్ యజమానికి ప్రభుత్వం 2022లో నష్టపరిహారం కింద నగదు చెల్లించడం జరిగిందని, ఆ స్థలాన్ని స్వాధీనం చేసిన అంగీకారపత్రాన్ని సైతం రెవెన్యూ అధికారులకు అందజేశారన్నారు. గతేడాది హోటల్ ఖాళీ చేయాలని చెప్పినా, చేయలేదన్నారు. 2025 నాటికి ఎక్స్‌ప్రెస్ హైవే రోడ్డు నిర్మాణాలను పూర్తి చేయాల్సి ఉందన్నారు. ఇందులో భాగంగా సంబంధిత యజమానులతో మాట్లాడి పనులను త్వరితగతిన పూర్తి చేసేందుకు సహకరించాలని కోరామన్నారు. ఈ నెల 22వ తేదీలోపు హోటల్‌ను ఖాళీ చేయాలని సదరు కళాగ్రాండ్ హోటల్ యజమానికి సూచించారు. హైవే నిర్మాణ పనులకు ఆటంకం కలిగిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు.

వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్


అధికారులతో సమావేశమైన ఎస్ఈ

పుంగనూరు: విద్యుత్ వినియోగదారులకు ఎలాంటి ఆటంకం లేకుండా నాణ్యమైన విద్యుత్‌ను సరఫరా చేస్తామని జిల్లా ఎస్ఈ ఇస్మాయిల్ అహ్మద్ తెలిపారు. శనివారం ఆయన పట్టణంలోని విద్యుత్ సబ్ స్టేషన్లను, కార్యాలయాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఈఈ శ్రీనివాసమూర్తి, డీఈఈ శ్రీనివాసులుతో కలసి విద్యుత్ సరఫరా, బిల్లులు, బకాయిలు, ట్రాన్స్‌ఫార్మర్ల ఏర్పాటు, లేన్ల మరమ్మతు, లైన్ల ఏర్పాటు విషయాలపై చర్చించారు. ఈ సందర్భంగా అన్ని ప్రాంతాల్లోనూ వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్‌ను అందించాలన్నారు. ప్రజల నుంచి వచ్చే సమస్యలపై తక్షణం స్పందించాలని, సిబ్బంది నిర్లక్ష్యం వహించరాదని సూచించారు. ఎలాంటి సమస్యలు ఉన్న తమ దృష్టికి తీసుకొస్తే తక్షణమే పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. ఏఈలు మహేంద్రరెడ్డి, ధనుంజయమూర్తి, సబ్ ఇంజనీర్ నవీన్ పాల్గొన్నారు.